ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 13 మార్చి 2024



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం పెంపు

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యాన్ని 38.75 శాతం నుంచి 42.50 శాతానికి పెంచుతూ ప్రభుత్వం కీలక ని ర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయంతో రాష్ట్ర ఖజానాపై రూ.1792.71 కోట్ల మేర కు భారం పడనుంది. ప్రస్తుత ఏడాది జనవరి 1 నుంచి అమల య్యేలా కరువుభత్యాన్ని నగదు రూపంలో చెల్లించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవా రం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కరువు భత్యాన్ని పెంచినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. కరువ భత్యం పెంపుపై ప్రభుత్వ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

లోక్‌సభ టిక్కెట్లపై కొనసాగుతున్న సస్పెన్స్

● జాబితాలు ఖరారు ● ప్రకటించడమే తరువాయి ● కాంగ్రెస్‌లో చేరిన జయప్రకాశ్ హెగ్డే ● బీజేపీ నుంచి రంగంలోకి ప్రముఖులు

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈసారి మొత్తం 28 లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్, బీజేపీ - జేడీఎస్ మిత్రపక్షాల మధ్య ముఖాముఖి పోటీ నెలకొనబోతుండడంతో అభ్యర్థుల ఎంపిక కసరత్తు తీవ్ర కుతూహలంగా మారింది. జాబితాలు దాదాపుగా ఖరారయ్యాయని, ప్రకటించడమే తరువాయి అని అత్యంత విశ్వసనీయంగా తెలుస్తోంది. బీజేపీ తొలి జాబితాలో 15మందికి పైగా అభ్యర్థుల పేర్లకు ఆమోదముద్ర లభించిందని సమాచారం. సోమవారం అర్ధరాత్రి వరకు ఢిల్లీలో బీజేపీ జాబితా కసరత్తు సాగింది. మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారు. పార్లమెంటులో పొగ బాంబు పేల్చిన నిందితులకు పాస్‌లు ఇచ్చిన మైసూరు ఎంపీ ప్రతాప్‌సింహకు ఈసారి టికెట్ ఇచ్చే అవకాశం లేదని అధిష్ఠానం పెద్దలు స్పష్టం చేసినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మైసూరు నుంచి యువరాజు యదువీర కృష్ణదత్త చామరాజ ఒడయార్ పేరు దాదాపుగా ఖాయమైంది. మాజీ ముఖ్యమంత్రులు జగదీశ్ శెట్టర్, బసవరాజ్ బొమ్మైను లోక్‌సభ ఎన్నికల బరిలోకి దించాలని అధిష్ఠానం నిర్ణయించింది. బెళగావి నుంచి శెట్టర్, హావేరి నుంచి బొమ్మై పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మాజీ ప్రధాని దేవేగౌడ అల్లుడు, హృద్రోగ నిపుణుడు డాక్టర్ సీఎన్ మంజునాథ్ పేరును బెంగళూరు గ్రామీణ నియోజకవర్గం కోసం సీరియస్‌గా పరిశీలిస్తున్నట్టు సమాచారం. తొలి జాబితాలో ప్రస్తుత సిట్టింగ్ ఎంపీలు పీసీ గద్దిగౌడర్, బీవై రాఘవేంద్ర, ఉమేశ్ జాధవ్, తేజస్వి సూర్య, పీసీ మోహన్, రమేశ్ జిగజిణగి, కరడి సంగణ్ణ పేర్లు ఖరారైనట్టు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. బళ్లారి నుంచి మాజీ మంత్రి శ్రీరాములు, ధారవాడ నుంచి కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి పోటీ చేయనున్నారు. ఇదే సమయంలో కొందరు హేమాహేమీలకు బీజేపీ అధిష్ఠానం ఈసారి గట్టిషాక్ ఇవ్వనుంది. సిట్టింగ్‌లలో కనీసం 9మందికి టిక్కెట్లు డౌటేనని బీజేపీ వర్గాలు అంటున్నాయి. మరోవైపు పొత్తులో భాగంగా జేడీఎస్‌కు మూడు నియోజకవర్గాలను కేటాయించినట్టు తెలుస్తోంది. మండ్య, హాసన్, కోలారు, నియోజకవర్గాల నుంచి బీజేపీ తన అభ్యర్థులను నిలబెట్టకుండా జేడీఎస్‌కు మద్దతు ఇవ్వనుంది. తుమకూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి వి. సోమణ్ణ బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తీవ్ర కుతూహలం రేకెత్తిస్తున్న చిక్కబళ్లాపుర నియోజకవర్గం నుంచి యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ కుమారుడు అలోక్ విశ్వనాథ్‌కు టిక్కెట్ దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ బీజేపీ టిక్కెట్ లభించకపోతే కాంగ్రెస్‌లో చేరి పోటీ చేయాలని మాజీ మంత్రి సుధాకర్ నిర్ణయించుకున్నట్టు సమాచారం.



కాంగ్రెస్‌లో చేరిన జయప్రకాశ్ హెగ్డేకు పార్టీ జెండా అందజేస్తున్న డీకే శివకుమార్

కాంగ్రెస్‌లోనూ తీవ్ర కుతూహలం

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లోనూ తీవ్ర కుతూహలం నెలకొని ఉంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కలబురగి నుంచి పోటీ చేస్తారని తొలుత వినిపించినా చివరిదశలో ఆయన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమనికి టిక్కెట్ దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య బెంగళూరులో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 75 శాతం మంది అభ్యర్థుల పేర్లు దాదాపు ఖరారయ్యాయని, త్వరలోనే అధిష్ఠానం ప్రకటిస్తుందని చెప్పారు. మరోవైపు బీసీల శాశ్వత కమిషన్ అధ్యక్ష పదవినుంచి తప్పుకున్న మాజీ ఎంపీ, బీజేపీ నేత జయప్రకాశ్ హెగ్డే మంగళవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం ఆసక్తి రేకెత్తిస్తోంది. ఆయన ఉడుపి-చిక్కమగళూరు నుంచి బరిలోకి దిగడం దాదాపు ఖాయమని తెలుస్తోంది. టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన నాయకులను కాంగ్రెస్ రాష్ట్ర నేతలు బుజ్జగించే పనిలో పడ్డారు. మొత్తానికి కాంగ్రెస్ జాబితా కూడా ఏ క్షణంలోనైనా విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.



ఖాళీ బిందెలతో నిరసన ఇలా...

ఖాళీ బిందెలతో బీజేపీ నిరసన

● నగరంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) పరిధిలో తాగునీటి హాహాకారాల నేపథ్యంలో బీజేపీ మంగళవారం ఖాళీబిందెలతో భారీ ప్రదర్శన నిర్వహించింది. బెంగళూరు ఫ్రీడం పార్కులో జరిగిన ఈ నిరసన ప్రదర్శనకు బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య, బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ సారథ్యం వహించారు. నగర బీజేపీ ఎమ్మెల్యేలు రవి సుబ్రహ్మణ్య, సీకే రామమూర్తి, విధానపరిషత్ చీఫ్ విప్ రవికుమార్, బెంగళూరు ఉత్తర జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్.హరీష్, బెంగళూరు సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సప్తగిరి గౌడతో పాటు వివిధ మోర్చాల పదాధికారులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పీసీ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నగరానికి తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. నగర ప్రజల తాగునీటి దాహార్తిని తీర్చేందుకు తొలి ప్రాధాన్యతను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ ప్రతినిధివర్గం జలమండలి అధ్యక్షుడికి ఒక వినతి పత్రం అందజేసింది. నగర ప్రజల తాగునీటి దాహార్తిపై దృష్టి సారించాలని, నీటి ఎద్దడి అధికంగా ఉన్నచోట్ల టాంకర్లతో నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేసింది.

ఎమ్మెల్యేకు లేఖ.. బస్సు రాక

● విద్యార్థిని ఉత్తరానికి స్పందించి బస్సు ఏర్పాటు



బాలికను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రియా కృష్ణ

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం సుంకదకట్ట సమీపంలోని మూళగాళలో ఉంటున్న లక్ష్మీదేవి అనే 9వ తరగతి విద్యార్థిని బస్సు సౌకర్యం లేకపోవడం వల్లే తాను గోవిందరాజనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసించలేకపోతున్నాంటూ కొద్దిరోజుల క్రితం స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రియాకృష్ణకు ఒక లేఖ రాసింది. ఈ లేఖపై ఎమ్మెల్యే తక్షణం స్పందించి మాళగాళ నుంచి గోవిందరాజనగర్‌కు బస్సును ఏర్పాటు చేయాల్సిందిగా రవాణా శాఖ అధికారుకు సూచించారు. అధికారులు కూడా సానుకూలంగా స్పందించి పట్టేగార పాళ్య, మాళగాళ మీదుగా శాటిలైట్ బస్టాండ్ వైపురాకపోకలు సాగించేలా బీఎంటీసీ బస్సును ఏర్పాటు చేశారు. ఈ బస్సు సదుపాయాన్ని స్వయంగా ఎమ్మెల్యే ప్రియా కృష్ణ మంగళవారం ప్రారంభించారు. తనకు లేఖరాసిన బాలికను కూడా ప్రత్యేకంగా కార్యక్రమానికి ఆహ్వానించి అభినందించారు. ఒక సామాన్య బాలిక రాసిన లేఖకు కేవలం రోజుల వ్యవధిలోనే ఎమ్మెల్యే స్పందించి బస్సును ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే స్పందన సోషల్ మీడియా లోనూ భారీగా వైరల్ అవుతోంది.

రాష్ట్రానికి మరో రెండు వందేభారత్ రైళ్లు

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రానికి మరో రెండు వందేభారత్ రైళ్లు దక్కాయి. కలబురగి - బెంగళూరు, మైసూరు - ఎంజీఆర్ సెంట్రల్ చెన్నై మధ్య వందేభారత్ రైళ్లకు మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు. త్వరలోనే ఈ రైళ్లు రెగ్యులర్‌గా సంచరించనున్నట్టు నైరుతి రైల్వే వర్గాలు వెల్లడించాయి. కాగా కేరళలోని తిరువనంతపురం నుంచి మంగళూరుకు మరో వందేభారత్ రైలును విస్తరించడంతో 10 వందేభారత్ రైళ్లకు గాను రాష్ట్రానికి మూడు దక్కడం గమనార్హం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కర్ణాటకకు రెండు వందేభారత్ రైళ్లతోపాటు ఒక రైలును విస్తరించినందుకుగాను ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కలబురగి - బెంగళూరు వందేభారత్ రైలు మార్గంలో మంత్రాలయం కూడా ఉండడంతో ఇది భక్తులకు ఎంతో వెసలుబాటు కానుందన్నారు.

వందే భారత్ రాకతో ప్రయాణం సౌకర్యవంతం: ఎంపీ

రాయచూరు : కలబురగి నుంచి బెంగళూరుకు వందే భారత్ రైలు అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతంలోని ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని లోకసభ సభ్యుడు రాజా అమరేశ్వర్ నాయక్ అన్నారు. దేశంలోని 12 మార్గాల్లో కొత్తగా ప్రారంభిస్తున్న వందే భారత్ రైళ్లకు మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయచూరు రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్, సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.శంకరప్ప, కిల్లే బృహన్మఠం శాంతమల్ల శివాచార్య స్వామి తదితర ప్రముఖులు ప్రధాని కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వందే భారత్ రైలు అందుబాటుకు రావడం వల్ల జిల్లా నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రయాణీకుల మరింత మెరుగైన సౌకర్యం ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వర్చువల్‌గా జెండా చూపుతున్న ప్రధాని నరేంద్రమోదీ

● వర్చువల్ ద్వారా ప్రారంభించిన ప్రధాని మోదీ



రాయచూరు రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలును పచ్చ జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్

18న శివమొగ్గకు ప్రధాని రాక

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 18న శివమొగ్గకు రానున్నారు. శివమొగ్గ లోక్‌సభ సభ్యుడు బీవై విజయేంద్ర మంగళవారం మీడియాకు ఈ విషయాన్ని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే భారీ ర్యాలీలో ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుడతారన్నారు. శివమొగ్గ, చిక్కమగళూరు, చిత్రదుర్గ, దావణగెరె, ఉడుపి నియోజకవర్గాల నుంచి కనీసం నాలుగు లక్షల మంది ప్రజలను ప్రధాని బహిరంగసభకు తరలించాలని నిర్ణయించామన్నారు. బహిరంగసభ ప్రాంగణంలో ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ముస్లిం పాలిత దేశాలలో వేధింపులు, దౌర్జన్యాలకు గురవుతున్న మైనారిటీలకు భారత పౌరసత్వం కల్పించే సీఏఏపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. సీఏఏ అమలుతో రాష్ట్రంలో గానీ, దేశంలోగానీ ముస్లిం మైనారిటీలకు అణుమాత్రమైనా సమస్య ఉండబోదన్నారు. ప్రధాని మోదీ గ్యారెంటీలకు సిద్దరామయ్య గ్యారెంటీలకు చాలా తేడా ఉందని రాఘవేంద్ర పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సాయంత్రం 6.31
సెహరి : గురువారం ఉదయం 5.13

అధికారుల తీరుతోనే రైతుల్లో ఆగ్రహం



ధర లేక కల్లాల్లోనే ఉన్న మిరప పంట

● ఒక్కరోజులోనే అమాంతం పడిపోయిన మిరప ధర ● అధికారులు, వ్యాపారులు కుమ్మక్కయ్యారనే రైతుల ఆందోళన ● బ్యాడిగి మిర్చి మార్కెట్‌కు ఒకే రోజు 4 లక్షల టన్నుల పంట ● కాలిపోయిన మిరప పంట ● నష్టపోయిన రైతులు ● మార్కెట్‌లో తిరిగి కొనుగోళ్లు ప్రారంభించిన అధికారులు

బళ్లారి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన పంట ధర ఒక్కరోజులోనే అమాంతం పడిపోవడంతో రైతుల్లో ఆగ్రహం పెల్లుబుకింది. వర్షాలు లేకపోవడంతో ఈసారి పంట దిగుబడి పెద్దగా లేదు. దీంతో తమ పంటకు విక్రయించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు ధీమాగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ధర ఒక్కరోజులోనే అమాంతం పడిపోవడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పంట చేతికి వచ్చిన సమయంలో ధర పడిపోవడం, వీటికి తోడు మార్కెట్ వర్గాలు రింగ్ కావడం.. ఇలా అనేక కారణాలతో మిరప సాగు రైతులు ఈ ఏడాది కష్టాల్లో చిక్కున్నారు. హావేరి జిల్లా బ్యాడిగిలోని ఏపీఎంసీ మార్కెట్ రాష్ట్రంలోనే అతిపెద్ద మిరప మార్కెట్. తుంగభద్ర జలాలు, వివిధ కాలువల కింద సాగు నీటితో మిరప పండించే గంగావతి, బీదర్, యాదగిరి, రాయచూరు, బళ్లారి, విజయనగరతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు, జిల్లాల రైతులు ఎక్కువగా మిరపను బ్యాడిగి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. మామూలుగా వారంలో మూడు రోజుల పాటు మార్కెట్ ఉంటుంది. మంగళ, గురు, ఆదివారాలు మార్కెట్ నిర్వహిస్తారు. రెండు వారాల క్రితం వారంలో రెండు రోజులే మార్కెట్ నిర్వహించేలా కమిటీ నిర్ణయించింది. దీనికి తోడు మహారాష్ట్ర నుంచి కూడా మిర్చి మార్కెట్‌కు అధికంగా వస్తోంది. దీంతో మార్కెట్ వర్గాలు రింగ్‌గా మారి మిరప ధరను తగ్గించారనే అనుమానం రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మార్కెట్‌కు సుమారు 4వేల టన్నుల మిరప వచ్చిందని అంచనా. ముందు రోజు క్వింటాలు మిరప ధర రూ. 16 నుంచి రూ. 20 వేల వరకూ పలికింది. ఉన్నట్లుండి ఆదివారం మార్కెట్ ఏకంగా రూ. 6 నుంచి రూ. 8 వేల క్వింటాలు ధర పడిపోవడంతో రైతులకు కడుపు మండింది. కష్టపడి పంటను పండించి అమ్ముకునేందుకు మార్కెట్‌కు తెస్తే కొనుగోళ్లు చేయకుండా పోవడం.. ధరను అమాంతం తగ్గించడంతో రాత్రంతా కంటికి కునుకు లేకుండా మార్కెట్‌లో పంట వద్ద కాపలా ఉన్న రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుని విధ్వంసానికి పూనుకున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరిని పోలీస్టేషన్‌లో ఉంచారు. మిరప పంట అమ్మేందుకు మార్కెట్‌కు వెళ్లిన రైతులు ఇంటికి ఇంకా తిరిగి వెళ్లకుండా పోవడంతో కుటుంబికులు ఆవేదన చెందుతున్నారు. రైతుల ఫోన్లు కూడా పనిచేయకపోవడంతో వారి బంధువులు, కుటుంబికులు ఆందోళన చెందుతున్నారు. బ్యాడిగి మిర్చి మార్కెట్‌లో ఆదివారం రైతులు జరిపిన దాడులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. దాడి చేసిన వారిలో అసలు రైతులు ఉన్నారా.. లేదా వేరే వాళ్లు ఇలా చేశారా అనే కోణంలో కూడా ప్రభుత్వం విచారణ చేస్తోంది. ఉద్యోగులు, పోలీసులపై రైతులు దాడి చేసేంత వరకూ ప్రభుత్వం ఎందుకు ఇలాంటి పరిస్థితిని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. బ్యాడిగిలో ఆదివారం జరిగిన ఘటనలో వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు తరలించిన మిరప పంట కాలిపోయింది. కొంత వరకూ చెల్లాచెదురుగా పడిపోయింది. దీంతో రైతులు మరింత నష్టపోయారు. రైతులు క్షణికావేశంతో అధికారులు, పోలీసులపైనా దాడి చేసి గాయపరిచారు. వీరంతా హసన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సహజస్థితికి బ్యాడిగి మిరప మార్కెట్

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బ్యాడిగి రకం మిర్చి ధర హఠాత్తుగా పడిపోవడంతో రైతుల ఆగ్రహంతో హింసాకాండ చెలరేగిన బ్యాడిగి పట్టణంలో సహజస్థితి నెలకొంటోంది. ముందుజాగ్రత్తగా బ్యాడిగిలో నిషేధాజ్ఞలు అమలు చేశారు. గత వారం వరకు క్వింటాలుకు రూ.20వేల వరకు ధర పలికిన మిరప ధర ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు మార్కెట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా హింసాకాండ చెలరేగింది. రాళ్లు రువ్విన ఘటనలతోపాటు వాహనాలకు నిప్పంటించారు. బ్యాడిగి మార్కెట్‌లో గతంలో ఎన్నడూ ఇలాజరగలేదని, ఇది అత్యంత విచారకరమని ఎమ్మెల్యే బసవరాజ శివణ్ణ వ్యాఖ్యానించారు. రైతుల ముసుగులో సంఘ విద్రోహకులు చొరబడ్డారన్న అనుమానం వ్యక్తం అవుతోందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై హోంశాఖ మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. కాగా పాకిస్థాన్ జిందాబాద్ నినాదాల కేసులో అరెస్టు అయిన వ్యక్తి ఈ ప్రాంతంవాడే అయినప్పటికీ అతడికి, ఈ ఘటనతో సంబంధం లేదని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. పరిసర ప్రాంతాలలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, దోషులుగా తేలినవారిపై కఠిన చర్యలు తప్పవని హోం మంత్రి హెచ్చరించారు. రాళ్లు రువ్విన ఘటనలో మార్కెట్ పాక్షికంగా దెబ్బతిందని, ఓ ప్రైవేట్ వాహనంతోపాటు అగ్నిమాపక శకటానికి కూడా దుండగులు నిప్పంటించారన్నారు. ఇంతవరకు ఎవరిని అరెస్టు చేయలేదని స్థానిక పోలీసులు వెల్లడించారు.




ధ్రువనారాయణకు నివాళులు అర్పిస్తున్న సీఎం తదితరులు

ధ్రువనారాయణ సేవలు చిరస్మరణీయం

● ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చామరాజనగరకు చెందిన మాజీ ఎంపీ ఆర్. ధ్రువనారాయణ ప్రజాక్షేత్రంలో అందించిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. ధ్రువనారాయణ తొలి వర్ధంతి సందర్భంగా చామరాజనగరలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం ప్రసంగిస్తూ చామరాజనగర జిల్లా ప్రగతికి ధ్రువనారాయణ అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన లేనిలోటు కాంగ్రెస్‌లో కనిపిస్తోందన్నారు. అజాతశత్రువుగా ఉన్న ధ్రువనారాయణ కుమారుడు, ఎమ్మెల్యే దర్శన్ ధ్రువనారాయణ కూడా తండ్రిబాటలోనే ముందుకు సాగుతుండడం సంతోషదాయకమన్నారు. రాజకీయాల్లో సిద్ధాంతాలు, నిబద్ధత చాలా ముఖ్యమన్నారు. సమాజంలో అసమానతలు తొలగించి అణగారినవర్గాలకు చేయూతను అందించే దిశలో ధ్రువనారాయణ కృషిని సీఎం స్మరించుకున్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి హెచ్‌సీ మహదేవప్ప, పశుసంవర్ధకశాఖ మంత్రి కె. వెంకటేశ్, యతీంద్ర సిద్దరామయ్యతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.25	1,599.47
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,042	8,005
సామర్థ్యం (టీఎంసీలు)	6.85	20.85

ఒక స్టేషన్ - ఒక ఉత్పత్తి ప్రారంభం



రైల్వే స్టేషన్‌లో సండూరు లంబాడీ ఉత్పత్తుల షాపు

బళ్లారి గాంధీనగర్, మార్చి 12: దేశ వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్‌లలో ప్రారంభమైన ఒక స్టేషన్- ఒక ఉత్పత్తి కార్యక్రమాన్ని వర్చువల్‌గా బళ్ళారి రైల్వే స్టేషన్‌లో కూడా మంగళవారం ప్రారంభించారు. ప్రధాని మోదీ రూ.85 కోట్ల రూపాయల నిధులు వెచ్చించి దేశంలో పలు రైల్వే స్టేషన్‌లలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బళ్లారి రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని సిటీ మేయర్ బి.శ్వేత ప్రారంభించారు. ప్రస్తుతం బళ్ళారి రైల్వే స్టేషన్‌లో సండూరు చేతివృత్తుల కళా కేంద్రం నుంచి లంబాడీ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను అమ్మకానికి ఉంచారు. ఈ సందర్భంగా మేయర్‌తోపాటు ఉప మేయర్ బి.జానకి, మెకానికల్ ఇంజనీయర్ ఆంజినేయులు, వైద్యులు సుశ్మితా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మహారుద్రగౌడ, పదాధికారులు, పాలికె సభ్యులు, రైల్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

వివిధ భాషల్లో ఖురాన్ ఆడియో విడుదల



ఖురాన్ ఆడియో పెన్‌డ్రైవ్‌ను విడుదల చేస్తున్నదృశ్యం

బళ్లారి సిటీ, మార్చి 12: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అరబిక్-కన్నడ, తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో ఖురాన్ ఆడియో స్క్రోల్‌ను పెన్ డ్రైవ్‌లలో విడుదల చేసినట్లు మాజీ మేయర్ కార్పొరేట్ సభ్యుడు ఇబ్రహీంబాబు తెలిపారు. నగరంలోని ఇందిరాసర్కిల్లో ఆయన శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ అవగాహన ఉన్నవారు తమ మాతృభాషలో ఖురాన్ మొత్తం అర్థం చేసుకోగలరన్నారు. ఖురాన్‌లోని ప్రాథమిక మంత్రాలు ,శ్లోకాలు అరబిక్‌లో ఉంటాయని, ప్రతి వాక్యం తర్వాత సంబంధిత బాషలలో ఆడియో సిద్ధం చేయబడిందన్నారు. ఈ పెన్ డ్రైవ్‌లను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కల్యాణ స్వామి, ఫాదర్ ఇవాన్ పింటో, గులాం మహ్మద్ సిద్దిఖీ ఖాజీ, కల్యాణ సంస్థాన మఠం స్వామి కృష్ణ చంద్ర దాస్ పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

సిరుగుప్ప, మార్చి 12 : రూ. 12 కోట్ల వ్యయంతో కర్చుగనూరు గ్రామంలో ఎమ్మెల్యే బీఎం నాగరాజు చెక్‌డ్యామ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మంగళవారం సిరుగుప్ప తాలుకా పరిధిలో వేదావతి నదికి సంబంధించి కర్చుగనూరు, ఇబ్రహీంపురం గ్రామాల మధ్య చెక్‌డ్యామ్ నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంజునాథ రెడ్డి, కౌన్సిలర్ గణేష్, వెంకటేష్, పవన్ కుమార్ దేశాయ్, కర్చుగనూరు, ఇబ్రహీంపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా మైనార్టీ మోర్చా కార్యదర్శిగా అల్లిపీరా

సిరుగుప్ప, మార్చి 12 : బీజేపీ జిల్లా మైనార్టీ కార్యదర్శిగా అల్లిపీర ఎంపికయ్యారు. సిరుగుప్ప తాలుకా మైనార్టీ మోర్చా అధ్యక్షులుగా ఆయన గతంలో సేవలు అందించారు. ఆయన సేవలను గుర్తించి బీజేపీ జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, జిల్లా మైనార్టీ కార్యదర్శిగా ఆయనను ఎన్నుకున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తానని అల్లిపీరా అభిప్రాయపడ్డారు.

ప్రారంభమైన రంజాన్ ఉపవాస దీక్షలు

రంజాన్ రోజా ఉపవాస దీక్షలు ప్రారంభమైనట్లు ఈద్ మిలాద్ కమిటీ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ నబీ తెలిపారు. పవిత్ర రంజాన్ చంద్రుని దర్శనం అనంతరం నెలరోజుల పాటు దీక్షలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షల అనంతరం రంజాన్ పండుగను ఆచరించనున్నట్లు తెలిపారు.

ఆర్థికవ్యవస్థలో అసంఘటిత కార్మికుల శ్రమ

ఏఐయూటీయూసీ జిల్లా అధ్యక్షుడు దేవదాస్

బళ్లారి గాంధీనగర్, మార్చి 12: దేశ ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత కార్మికుల శ్రమ దాగి ఉందని, అందులో కోట్లాది మహిళలు అసహనీయ వాతావరణంలో శ్రమిస్తున్నారని ఏఐఎటియుసి జిల్లా అధ్యక్షులు యు.దేవదాస్ ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘటన(ఏఐఎంఎస్ఎస్), ఆల్ ఇండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్ సెంటర్(ఏఐయూటీయూసీ) సంయుక్తంగా మంగళవారం స్థానిక గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నాయి. ఈ సందర్భంగా ఏఐయుటియుసి జిల్లా అధ్యక్షుడు యు.దేవదాస్ మాట్లాడుతూ అసంఘటిత కార్మిక పరిధిలోకి వచ్చే ఆశా, అంగన్‌వాడి, మధ్యాహ్న బోజన పథకం లాంటి ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న మహిళలతో పాటు గార్మెంట్స్, ఆసుపత్రి, ఫ్యాక్టరీలలో పనిచేసే మహిళలకు పనికి తగ్గట్టుగా వేతనం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమం కోసం కృషి చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ కంపెనీలకు ఎర్రతివాచీలు పరుస్తున్నారేగాని దేశ ఆర్థికాభివృద్ధికి శ్రమిస్తున్న శ్రామిక రంగం కోసం చేసిన కృషి ఏమిలేదన్నారు. అనంతరం ఏఐయుటియుసి జిల్లా అధ్యక్షురాలు శాంత మాట్లాడుతూ గతంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా గళం ఎత్తిన మహిళల పోరాట ఫలితంగానే నేడు మహిళలకు హక్కులు వచ్చాయన్నారు. కేవలం మహిళా దినోత్సవం చేసుకోవడం సరిపోదని, నిరంతరం మహిళల హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. 1908 మార్చి 8వ తేదీన అమెరికాలో జరిగిన మహిళా కార్మికుల పోరాటఫలాలను నేడు అనుభవిస్తున్నామని, అందుకు గుర్తుగా ప్రతియేటా మార్చి 8న మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఏఐఎంఎస్ఎస్ జాయింట్ సెక్రటరీ విద్యావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఐయుటియుసి జిల్లా అధ్యక్షుడు యు.దేవదాస్

బళ్లారిలో వరిధాన్యం కొనుగోళ్లకు జీరో రిజిస్ట్రేషన్లు

బహిరంగ మార్కెట్‌లో బియ్యానికి ధర పెరగడమే కారణం

బళ్లారి సిటీ, మార్చి 12: కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర పథకం కింద సాధారణ వరి ధాన్యం కొనుగోలుకు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించగా.... జిల్లాలో రైతులు ఆ ఊసే ఎత్తుకోలేదు. బహిరంగ మార్కెట్లో వరికి ఎక్కువ ధర లభించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో ఈసారి బియ్యం ధర భారీగా పెరిగే అవకాశంఉందని రైతులు భావిస్తున్నారు. ఎంఎస్‌పీ కింద వరి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి 2-3నెలలు గడిచాయి. అయితే ఇప్పటి వరకు జిల్లాలో వరి ధాన్యం విక్రయించేందుకు నమోదు చేసుకున్న వారి సంఖ్య శూన్యం. మరల నమోదు తేదీ కూడా పొడిగించారు. ప్రభుత్వం సాధారణ వరికి క్వింటాల్‌కు రూ. 2,183, ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2,023 ధర నిర్ణయించింది. నమోదు చేసుకున్న రైతుల నుంచి ఎకరాకు 25 క్వింటాళ్ళ చొప్పున గరిష్టంగా 40 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అనుమతి ఉంది. అయితే వరి ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు మాత్రం సిద్ధంగా లేరు. బళ్లారి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 71వేల హెక్టార్లలో వరి సాగైంది. బహిరంగ మార్కెట్లో వరికి మంచి ధర ఉండడంతో కొనుగోలు కేంద్రంలో నమోదు చేసుకోవడానికి రైతులు ముందుకు రావడం లేదని బళ్లారి రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు జిల్లా మేనేజర్ ఆశిక్ అలీ చెబుతున్నారు. మార్కెట్లో క్వింటాల్ బియ్యం రూ.3వేలు ఉండగా, కనీస మద్దతుధరను 2,183గా నిర్ణయించినట్లు తుంగభద్ర రైతు సంఘం బళ్లారి అధ్యక్షుడు పురుషోత్తమగౌడ్ తెలిపారు.

లింగ నిర్ధారణ చేయడం నేరం

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి, న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, మార్చి 12: ఆడపిల్ల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ అనేది చట్టం ప్రకారం నేరమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి రాజేశ్ హొసమనె అన్నారు. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాపరిపాలన, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మహిళా,శిశు అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో విమ్స్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల్లిగా కుటుంబ బాధ్యతలను స్త్రీ త్యాగంతో నిర్వహిస్తుందని, మహిళను సమాజం పుత్రికగా చూస్తుందని, ఇప్పుడు కూడా అంతే గౌరవంగా చూడాలని అన్నారు. లింగ నిష్పత్తి సమానంగా లేకపోతే సమాజ శ్రేయస్సుకు భంగం వాటిల్లుతుందన్నారు. అంతే కాకుండా మహిళలు హింసకు గురయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాపంచాయితీ ముఖ్యకార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ భ్రూణహత్యల నివారణ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీ స్త్రీకి నెలలు నిండకుండానే అబార్షన్ అయినప్పుడు మొదటి ఆడపిల్ల అయితే ,తిరిగి గర్భం దాల్చినప్పుడు లేదా శిశు మరణాలు సంభవించినప్పుడు గ్రామీణ స్థాయిలోని ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు గమనించాలన్నారు. నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మత్తు వైద్య నిపుణులు డాక్టర్ శ్వేతా ,న్యాయవాది గురుబసవరాజ్ ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఈసందర్భంగా విమ్స్ డైరెక్టర్ గంగాధరగౌడ, మహిళాశిశు అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు విజయ్‌కుమార్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్ , జిల్లా నరన్ బసారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్నిప్రారంభిస్తున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

జేఎస్‌డబ్ల్యూలో ప్రజాభిప్రాయ సేకరణ రసాభాస

తోరణగల్లు, మార్చి 12 : జేఎస్‌డబ్ల్యూ సంస్థలో ఉత్పాదనను ఆరు మెట్రిక్ టన్నుల నుంచి 12 మెట్రిక్ టన్నులకు పెంచడంపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం మంగళవారం సమావేశం ఏర్పాటు చేయగా పలువురు ఆమోదం తెలపగా మరికొందరు వ్యతిరేకించారు. సమావేశానికి హాజరైన డిప్యూటీ కలెక్టర్, ఇతర అధికారులు తోరణగల్ గ్రామ సమీపంలోని ఎస్ఎంటీ గేటు సమీపంలోని బయలు ప్రదేశంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రజలు పుర ప్రముఖులు సండూరు, కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షులు రాజు వాల్మీకి సంఘం అమరేష్, కుడితిని శిల్ప గాదిగనూరు నాగమ్మ, పకీరమ్మ, ప్రముఖులు ఏకాంబరప్ప, పంపాపతి, నూర్ మహమ్మద్ షబ్బీర్ మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ ఉత్పాదన పెంచడం వలన పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అలాగే రైతులను ఆదుకోవాలని, పొల్యూషన్‌పై దృష్టిపెట్టాలని కోరారు. సమస్యలను పరిష్కరించి సిమెంట్ ఉత్పాదనను పెంచడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా ప్రగతిపర సంఘాల పదాధికారులైన మలియప్ప, సయ్యద్, సికిందర్, కోనప్ప, కర్ణాటక రక్షణ వేదిక తోరణగల్లు, హంబ్బలి అధ్యక్షులు దొడ్డ బసప్ప, చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ తాము ఎవరికీ విరోధం కాదని ఇప్పుడు పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వలన ఆస్తమా, చర్మరోగాలు వస్తున్నాయని, అలాగే ప్రజల ఆయుష్షు తగ్గుతోందని, అందువలన ప్రస్తుత పరిస్థితులలో సిమెంట్ ఉత్పాదనను పెంచరాదని మనవి చేశారు. ఈ వాదులాటలో సమావేశం రసాభాసగా ముగిసింది. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేరి, పరిసర అధికారులైన మురళీధర్, శరణయ్య జిందాల్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజలు

దొడ్డ బసవేశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం : కలెక్టర్

కంప్లి, మార్చి 12 : ఈ నెల 25వ తేదీన కురుగోడు దొడ్డబసవేశ్వరస్వామి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుందామని జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా విజ్ఞప్తి చేశారు. కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామి ఆలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. రథోత్సవానికి వచ్చే భక్తులకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటితో పాటు విద్యార్థులకు ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు రాబోతున్నాయని, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విద్యాశాఖాధికారులు చూసుకోవాలన్నారు. కేఎస్ఆర్టీసీ సుమారు 40 నుంచి 50 బస్సులు కంప్లి, సిరుగుప్ప మీదుగా బళ్లారికి నడపాలని సూచించారు. పట్టణంలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ప్రధాన వీధులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి యేడాదిలాగే ఈ యేడాది కూడా ఘనంగా రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఆలయంలో పారిశుధ్యపనులు చేపట్టి, ఐదు శౌచాలయాలు, గదులను సిద్ధంచేశామన్నారు. ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ దొడ్డ బసవేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని ఆ కమిటీ వారే అన్నింటికీ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ హేమంత్ కుమార్, ఎస్పీ రంజిత్ కుమార్ భండార్, తహసీల్దార్ రేణుక, పోలీసులు విశ్వనాథ్ , సుప్రీత్, విరుపాక్షప్ప, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమ్మవారు ఐక్యంగా ఉండాలి / బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు



బుడా అధ్యక్షుడిని సన్మానిస్తున్న కమ్మసంఘం నాయకులు

బళ్లారి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కమ్మకులస్తులంతా ఐకమత్యంగా ఉండి మనం ఎదగడంతో పాటు సమాజానికి కూడా మంచి పనులు చేయాలని బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు పేర్కొన్నారు. బళ్లారిలోని గురు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కమ్మసమాజానికి చెందిన ప్రముఖులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సీనియర్ నాయకుడు బెస్టు స్కూల్ రామప్ప, కార్పొరేటర్ ముల్లంగి నందీష్, ముండ్లూరు వివేక్, రామాంజినేయులు, నాగరాజు, ముండ్లూరు విజయ్‌కుమార్, శ్రీనివాసురావు, రఘు, మాజీ మేయర్ గుర్రం రమణ, ఉజ్వల, స్పాంజ్ ఐరన్ కంపెనీ ప్రతినిధి వాసు, ముల్లంగి చంద్రశేఖర్ చౌదరిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుర్రం లాల్‌మోహన్, జీ శ్రీనివాసులు, డి. బీమప్ప చౌదరి, కృష్ణమనాయడు, కోట క్రిష్ణబాబు, మోహన్‌దాస్, హరిబాబు, నాని, మంజు, జేడీఎస్ పార్టీ కిరణ్, దామోదర్ నాయుడు, తగ్గుపర్తి శ్రీనా, సీ ప్రకాష్, కాకర్లతోట విజ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆనెగొంది ఉత్సవాల ముగింపు



మంత్రి శివరాజ తంగడిని సత్కరిస్తున్న జనార్దనరెడ్డి

గంగావతి రూరల్,మార్చి 12:ఆనెగొందిలో మంగళవారం ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనార్ధనరెడ్డి మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో అనేక మంది కళాకారులు పాల్గొని కృష్ణదేవరాయల పాలనను గుర్తుకుతెచ్చారన్నారు. ఈసందర్భంగా ఎంపి కరడి సంగన్న, మంత్రి శివరాజ తంగడిగి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనాథ్, డీసీ తలసి, ఎస్పీ యశోధ, సంగీత దర్శకుడు హంసలేఖ, ఫిలిం హీరో ధ్రువసర్జన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే గోదామును ప్రారంభించిన మోదీ



గంగావతి రైల్వేస్టేషన్‌లో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మునవళ్ళి

గంగావతి రూరల్, మార్చి 12: గంగావతి రైల్వే స్టేషన్‌లో రూ.2.5కోట్ల వ్యయంతో రైల్వే గోదామును వర్చువల్‌గా ప్రధానమంత్రి మోదీ మంగళవారం ప్రారంభించారు. ఈసమారంభంలో గంగావతి పరణ్ణ మునవళ్ళి, ప్రముఖులైన ఉమేశ్ సింగనాల్, నీలకంఠ కట్టిమని, కాశీనాథ,సింగనాళ సురేశ్, సంగయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రాంతాలుగా ఆరు తాలూకాల గుర్తింపు

కంప్లి, మార్చి 12 : విజయనగర జిల్లాలోని ఆరు తాలుకాలను కరువు తాలూకాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ యేడాది ఖరీఫ్, రబీలో రైతులు వేసుకున్న పంటలు చేతికి రాకపోవడంతో ప్రభుత్వం సర్వే చేపట్టి ఆరు తాలుకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిందని జిల్లా అధికారి దివాకర్ తెలిపారు. హగరి బొమ్మనహళ్ళి, కొట్టూరు, హడగళి, హరప్పన హళ్లి, హొస్పేట తాలుకాలను కరువు తాలుకాలుగా ప్రకటించారని తెలిపారు. ఆయా తాలుకాల్లోని రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

బాధ్యతలు తీసుకున్న రెడ్డి రాయ్‌గౌడ



కంప్లి, మార్చి 12 : కంప్లి పురసభ ముఖ్య అధికారిగా రెడ్డి రాయ్‌గౌడ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ముఖ్య అధికారిగా వున్న దుర్గన్న ఎన్నికలసందర్భంగా చిందనూరుకు బదిలీ కావడంతో సింధనూరులో వున్న రెడ్డి రాయ్‌గౌడ కంప్లి పురసభ ముఖ్యఅధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఎన్నికలు జరుపుకుందామన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

బళ్లారిరూరల్, మార్చి 12 :సరిహద్దులోని ఇరు రాష్ట్రాల ప్రజలకు అనుకూలంగా వుండేందుకు తాలుకాలోని రాయాపురం - బొల్లనగుడ్డం రోడ్డు అభివృద్ధి పనులకు రూ. 3 కోట్ల వ్యయంతో మంగళవారం శ్రీకారం చుట్టారు. రోడ్డు గుంతలమయం కావడంతో మంగళవారం మంత్రి నాగేంద్ర సోదరుడు వెంకటేష్ ప్రసాద్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

హోసూరు జోన్

మాదకద్రవ్యాల నియంత్రణకై మానవహారం



నిరసనలో పాల్గొన్న అన్నాడీఎంకే ప్రసన్న తదితరులు

హోసూరు మార్చి 12: సారాయి, బ్రాందీ, విస్కీ వంటి మత్తు పానీయాలతోపాటు మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అన్నాడీఎంకే డిమాండ్ చేసింది. మత్తు, మాదకద్రవ్యాల ద్వారా యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఇందుకు అడ్డుకట్ట వేయాలని కోరింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పిలుపు మేరకు కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద అన్నాడీఎంకే సభ్యులు మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన సాగింది. నిరసనలో నిర్వాహకులు రాము, మంజునాథ్, రాజు, వాసుదేవన్, హేమకుమార్, కార్పొరేషన్ మండల కమిటీ అధ్యక్షులు జయప్రకాశ్, పురుషోత్తమరెడ్డి, హోసూరు మున్సిపాలిటీ మాజీ కార్యదర్శి నారాయణన్, యూనియన్ కార్యదర్శి రవి, యూనియన్ ఉప కార్యదర్శులు నవీన్, రమేశ్, హోసూరు యూనియన్ కమిటీ అధ్యక్షుడు శశివెంకటస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై శిక్షణ శిబిరం

హోసూరు(సిప్‌కాట్) మార్చి 12 : హోసూరు సమీపంలోని చూడుగొండపల్లి గ్రామంలో కూరగాయల పంటల నిర్వహణపై మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. వ్యవసాయశాఖ అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలు, సహజ తెగుళ్ళు, వ్యాధుల నివారణ సాంకేతిక పద్ధతులు, మట్టి నమూనా సేకరణ ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరణ సాంకేతిక పద్దతులు, వర్మికంపోస్టు తయారీ, లాభాలు, ప్రయోజనాలను వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు భువనేశ్వరి రైతులకు వివరించారు. అదియమాన్ వ్యవసాయ కళాశాల, అత్తిముగం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రోహిణి సౌర విద్యుత్‌తో నడిచే లాంతర్‌లు, ఇతర ప్రయోజనాలను వివరించారు. హానికరమైన కీటకాల నియంత్రణ, దిగుబడిని పెంచే సాంకేతిక పద్ధతుల గురించి, రసాయన ఎరువులకు బదులు సహజ ఎరువులతో పంచగవ్య జీవామృతం తయారీ గురించి రైతులకు వివరించారు. భూసారాన్ని మెరుగుపరచడానికి వ్యవసాయ అధికారి రేణుక సూక్ష్మపోషక ఎరువులు, జీవామృతం వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బిందు సేద్యం ప్రాముఖ్యతను సహాయ వ్యవసాయ అధికారి మురుగేశన్ తెలిపారు.

పాఠాళీ మక్కళ్ పార్టీలోకి పలువురి చేరిక

హోసూరు(మత్తిగిరి) మార్చి 12: పాఠాళీ మక్కళ్ పార్టీ పశ్చిమ జిల్లా కార్యాలయం హోసూరులో మంగళవారం 30మందికిపైగా కార్యకర్తలు చేరారు. జిల్లా కార్యదర్శి గోవిందరాజుల ఆధ్వర్యంలో ఖాళీ స్థలాల్లో పార్టీ జెండా ఎగురవేసి, కొత్త శాఖల ఏర్పాటు, నూతనంగా చేరినవారికి పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీపై సమావేశంలో చర్చించారు. వేర్వేరు పార్టీలనుంచి వీడిన కార్యకర్తలు పాఠాళీ మక్కళ్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాతో నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా సంస్థ కార్యదర్శి కృష్ణన్, జిల్లా మాజీ ఉప కార్యదర్శి శరవణన్, అన్బుమణి, జిల్లా కార్యదర్శి జీవా, జిల్లా అధ్యక్షుడు మురుగేశ్, యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసన్, యూనియన్ కార్యదర్శి కృష్ణన్, డివిజన్ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పాఠాళీ మక్కళ్ పార్టీలోకి చేరినవారిని కండువాలతో స్వాగతిస్తున్న నాయకులు

రాజ్యాంగాన్ని మార్చడం ఎవరి తరం కాదు: మంత్రి



రాయచూరు, మార్చి 12 : భారత రాజ్యాంగాన్ని మార్చడం ఎవ్వరితరం కాదని రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి నాగేంద్ర అన్నారు. తమకు పార్లమెంట్‌లో పూర్తిస్థాయి మెజార్టీని అప్పగిస్తే భారత రాజ్యాంగపు పీఠికను మార్చుతామంటూ ఇటీవల లోకసభ సభ్యుడు అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలు మూర్ఖత్వంతో కూడినవని ఆయన ఎద్దేవా చేశారు. మంత్రాలయం దర్శనం కోసం వెలుతున్న మంత్రి నాగేంద్ర నగరంలో మంగళవారం కొద్ది సేపు విలేఖరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీకి కూడా ఇదే రాజ్యాంగం ద్వారా పదవి లభించిందన్న సత్యాన్ని బీజేపీ నాయకులు మరవరాదన్నారు. రాజ్యాంగ బద్ధంగా పదవులను అనుభవిస్తు అదే రాజ్యాంగం పట్ల చులకన వ్యాఖ్యలు చేస్తున్న అనంత కుమార్ హెగ్డేలాంటి వారిని ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించి గుణపాఠం నేర్పాలన్నారు. తమ కుటుంబం యావత్తు రాఘవేంద్ర స్వామి భక్తులమని అందుకే చిన్ననాటి నుంచి తాను ప్రతి ఏటాఈ స్వామి వారిని దర్శించుకుంటానన్నారు. రాష్ట్రంలోని 28 స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులే గెలుపొందుతారని ఈ సందర్భంగా మంత్రి ధీమా వ్యక్తం చేశారు. కాగా తన సోదరుడు కాంగ్రెస్ టికెట్‌ను ఆశిస్తున్నారని పార్టీ నాయకత్వం ఎవ్వరికి అవకాశం కల్పించినా గెలుపే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా రాజ్యాంగం లేకపోతే దేశంలో రక్తపాతం జరుగుతుందంటూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలను మంత్రి నాగేంద్ర గట్టిగా సమర్థించారు. రాజరికపు కాలంలో అధికార మార్పు రక్తపాతంతోనే జరిగేదన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ప్రతిఒక్కరు రాజ్యాంగాన్ని గౌరవించడం మంచిదన్నారు.

సార్వత్రిక ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించాలి

రాయచూరు, మార్చి 12 : ఈవీఎంలను తొలగించి వచ్చే లోకసభ ఎన్నికలను బ్యాలెట్ పద్దతిలో నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ తాలూకా అధ్యక్షుడు అమరేశ్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు, మంగళవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరేశ్ మాట్లాడుతూ, గత ఎన్నికల్లో అనేక మంది అభ్యర్థుల గెలుపు అందరిని ఆశ్చర్యానికి గురిచేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. గతంలో మాదిరిగా బ్యాలెట్‌ల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని రాజకీయ పార్టీలు, మేధావులు చేసిన విజ్ఞప్తులపై ఈసీఐ అనుసరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ప్రభుత్వం మొండిపట్టును వీడి బ్యాలెట్ పత్రాలవైపు మొగ్గు చూపాలన్నారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ నాయకులు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

రాయప్రోలు సుబ్బారావు (జయంతి)



'నవ్య కవితా పితామహుడి'గా పేరొందిన రాయప్రోలు సుబ్బారావు 1892 మార్చి 13న గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలో జన్మించారు. తెలుగులో భావకవిత్వానికి ఆద్యుడు. గొప్ప జాతీయవాది, తెలుగుజాతి అభిమాని. ఆయన దేశభక్తి గీతాలు ఎంతో ఉత్తేజాన్ని కలిగించేలా ఉంటాయి. 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని నిలుపరా నీజాతి నిండుగౌరవం' పద్యం ఎంతో పేరొందింది. ఆయన రచనలు ప్రధానంగా ఖండ కావ్యాలు. 1913లో రాసిన 'తృణ కంకణము'తో తెలుగు కవిత్వంలో నూతనశకంగా భావిస్తారు. ఇందులో అమలిన శృంగారతత్వాన్ని ఆవిష్కరించారు. సమాజానికి అనుగుణంగా భావుకతను అల్లి తెలుగు కవితకు కొత్త సొగసులు అద్దారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. 1984 జూన్ 30న కన్నుమూశారు.

బూర్గుల రామకృష్ణారావు (జయంతి)



బూర్గుల రామకృష్ణారావు 1899 మార్చి 13న రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి సమీపాన పడకల్ గ్రామంలో జన్మించారు. బహుభాషావేత్త, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు, రచయిత, న్యాయవాది. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి, ఉత్తరప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించారు. న్యాయవాదిగా ఉంటూనే రాజకీయాల్లో పాల్గొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. ఆయన రచనలు 'సారస్వత వ్యాస ముక్తావళి' పేరిట ప్రచురితమయ్యాయి. గౌరవ డాక్టరేట్‌లు పొందారు. 1967 సెప్టెంబరు 14న గుండెపోటుతో కన్నుమూశారు.

స్వామి విజయేంద్ర సరస్వతి (పుట్టినరోజు)



శంకర విజయేంద్ర సరస్వతి 1969 మార్చి 13న తమిళనాడు రాష్ట్రం తిరువళ్ళూర్ జిల్లాలో జన్మించారు. అసలు పేరు శంకర నారాయణన్. కంచీ పురంలోని కంచికామకోటి పీఠానికి 70వ జగద్గురుగా వ్యవహరిస్తున్నారు. 69వ పీఠాధిపతి జయేంద్ర సరస్వతి శిష్యత్వంతో ఆయన తర్వాతి స్థానాన్ని 49వ యేట చేపట్టారు. మఠం నియమాల ప్రకారం బాలసన్యాసిగా ఉన్నప్పుడే అప్పటి పీఠాధిపతి తన తర్వాతి పీఠాధిపతిని ప్రకటిస్తారు. ఇలా 1983 మే 29న 70వ పీఠాధిపతిగా ప్రకటించారు. ఆయన వివిధశాస్త్రాలలో నిష్ణాతులు. ప్రత్యేకించి అద్వైత వేదాంతంలో రాణించారు.

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.78.71 లక్షలు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

కదిరి, మార్చి 12: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. 60రోజులకుగాను రూ.78.71 లక్షల ఆదాయం వచ్చింది. విదేశీ కరెన్సీ అమెరికా డాలర్లు 928, యూరో కరెన్సీ రూ.50, భూటాన్ 41, నేపాల్ 5 రూపాయలు, దక్షిణాఫ్రికా 10, కెనడా 20, శ్రీలంక 1500, ఇండోనేషియా 100 తేలింది. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షణాధికారి నరసింహరాజు, కెనరా బ్యాంకు మేనేజర్ మధుసూదన్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు.

నేడు సమన్వయ సమావేశం

శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుధవారం ఆలయ కల్యాణ మండపంలో వివిధ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆర్డీఓ వంశీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందన్నారు.

మోదీ మళ్లీ ప్రధాని కావాలి

పావగడ, మార్చి 12: దేశ సమగ్ర అభివృద్ధి, భద్రత కోసం నరేంద్రమోదీ మూడోసారి ముచ్చటగా ప్రధానమంత్రి కావాలని చిత్రదుర్గం మాజీ ఎంపీ ఏ జనార్దనస్వామి పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకప్పుడు దేశం అంటే అన్ని రంగాల్లో వెనుకబడి ఉండేదని, మోదీ 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రపంచ దేశాలే దేశం వైపు తిరిగి చూసేలా చేశారని అన్నారు. కొన్ని బ్యాంకులు, ఫ్యాక్టరీలన ప్రైవేటీకరణ చేసినప్పటికీ ఉద్యోగ భద్రత కల్పించడంలో మోదీ ఎంతో శ్రమించారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మోదీ విలువ మరింత పెరిగిందని వివరించారు. ఎగువ భద్రా నీటిని పావగడకు తరలించడంలో పావగడ, చళ్లకెరె, ములకాలమూడు తాలూకాలో ప్రణాళికలో లేనప్పటికీ తన వాటిని చేర్పించానన్నారు. వాటికి నీరందించేందుకు కృషి చేశానని తెలిపారు. తను చేసిన అభివృద్ధి, సేవలను గుర్తించి చిత్రదుర్గం ఎంపీ టిక్కెట్ కేటాయిస్తే తాను ఎన్నికల బరిలో దిగుతానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, రాజేష్ తదితరులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జనార్దనస్వామి

కన్నడ భాషా సంస్కృతుల పరిరక్షణే తొలి ప్రాధాన్యం

» ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాషా సంస్కృతుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ విషయంలో రాజీపడే ప్రశ్నే లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పష్టం చేశారు. బెంగళూరులోని తన నివాసం కావేరిలో మంగళవారం 'హెసరాయితు కర్ణాటక - ఉసిరాగలి కన్నడ' అభియానలో భాగంగా ఫస్ట్‌డే పోస్టల్ కవర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కర్ణాటక నామకరణం జరిగి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా రాష్ట్రమంతటా పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కన్నడ సాంస్కృతికశాఖ మంత్రి శివరాజ్ తంగడగి, ఎమ్మెల్సీ నాగరాజ్ యాదవ్, కన్నడ సాంస్కృతికశాఖ కార్యదర్శి అజయ్ నాగభూషణ్, డైరెక్టర్ డాక్టర్ ధరణీదేవి మాలగత్తి, కర్ణాటక సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఫస్ట్‌డే కవర్లను విడుదల చేస్తున్న సీఎం సిద్దరామయ్య

నామఫలకాలలో కన్నడ 60శాతం తప్పనిసరి



కరవే ఆధ్వర్యంలో ర్యాలీ

బాగేపల్లి, మార్చి 12: దుకాణాలు, ఇతర వాణిజ్య సముదాయాల నామఫలకాలలో 60శాతం కన్నడ తప్పనిసరిగా ఉండాలనే డిమాండ్‌తో కర్ణాటక రక్షణా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు నేషనల్ కాలేజ్ నుంచి ప్రవాసిమందిరం వరకు దుకాణదారులకు కరపత్రాలు అందజేసి జాగృతి కల్పించారు. రాష్ట్రంలో కన్నడ భాషకే అగ్రతాంబూలమన్నారు. కన్నడను నిర్లక్ష్యం చేసేలా వ్యవహరించరాదన్నారు. తాము ఇతర భాషలను వ్యతిరేకించడం లేదని కన్నడను చిన్నచూపు చూస్తే సహించేది లేదన్నారు. ర్యాలీలో కరవే తాలూకా ప్రధాన కార్యదర్శి రియాజ్ ఉల్లా, తాలూకా ఉపాధ్యక్షులు చిన్ను, తాలూకా ఉపాధ్యక్షుడు అలీమ్, మహిళా అధ్యక్షురాలు గంగరత్నమ్మ, తాలూకా కోశాధికారి నారాయణస్వామి, తాలూకా సంచాలకులు శివకుమార్, తాలూకా కార్యదర్శి మంజునాథనాయ్క తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల సమావేశం

» సీఎం సహా మంత్రుల రాక

చింతామణి, మార్చి 12: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల సమావేశం బుధవారం జరగనుంది. పట్టణ శివారులోని ఆంజనేయస్వామి దేవస్థానం సమీపాన భారీ బహిరంగసభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు డాక్టర్ జీ పరమేశ్వర్, రామలింగారెడ్డి, దినేశ్ గుండూరావు, డాక్టర్ శరణప్రకాశ్‌పాటిల్, కే వెంకటేశ్, కేఎన్ రాజణ్ణ, బైరేతి సురేశ్, లక్ష్మీ హెబ్బాళ్కర్, సీఎం రాజకీయ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఐదు గ్యారెంటీ పథకాల కమిటీ అధ్యక్షుడు హెచ్‌ఎం రేవణ్ణ, ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ మంజుళా జిల్లా స్థాయి అధికారులు విచ్చేయనున్నారు. సమావేశానికి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, చింతామణి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ఎంసీ సుధాకర్ అధ్యక్షత వహించనున్నారు. సమావేశం కోసం రెండు రోజులుగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. సీఎం, డీసీఎంలు హెలికాప్టర్‌లలో విచ్చేయనున్న తరుణంలో చెన్నసంద్ర వద్ద హెలిప్యాడ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఇక కార్యకర్తలు, లబ్ధిదారులు విచ్చేసే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ వ్యవస్థ కల్పిస్తున్నారు.



సిద్ధమవుతున్న భారీ వేదిక ఇలా...

ఐటీ కంపెనీలో ల్యాప్‌టాప్‌ల చోరీ - ఐదుగురి అరెస్ట్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ దయానంద్

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడన్నది సామెత. అయితే తాము పనిచేస్తున్న కంపెనీలకు కన్నం వేసి భారీగా ల్యాప్‌టాప్‌లు, క్రోమ్‌బాక్స్‌లను చోరీ చేస్తున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతోపాటు మొత్తం ఐదుగురిని కుమారస్వామి లే అవుట్ పోలీసులు అరెస్టు చేశారు. వీటి వివరాలను నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద్ మంగళవారం మీడియా సమావేశంలో ప్రకటించారు. అరెస్టు అయినవారిని దర్శన్, సుజయ్, కార్తీక్, శశికుమార్, నీలేశ్‌లుగా గుర్తించామన్నారు. నిందితులనుంచి రూ.16లక్షల విలువైన 25 కంపెనీల ల్యాప్‌టాప్‌లు, 55 క్రోమ్‌బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కుమారస్వామి లే అవుట్‌లోని న్యూ జైసా టెక్నాలజీస్ కంపెనీలో కొద్దికాలంగా ల్యాప్‌టాప్‌లు, క్రోమ్‌బాక్స్‌లు మాయ మయ్యాయి. దీనిపై సదరు కంపెనీ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ జగదీశ్ నేతృత్వంలోని బృందం అదే కంపెనీలో ల్యాప్‌టాప్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వారి పనేనని గుర్తించి కూపీ లాగగా వీరితోపాటు వారి సహచరులు ముగ్గురు దొరికిపోయారు.

రూ.2.09 కోట్లతో మిగులు బడ్జెట్

శిడ్లఘట్ట, మార్చి 12: శిడ్లఘట్ట నగరసభ పరిధిలో 2024-25 సంవత్సరానికి రూ.219 కోట్ల రూపాయలతో బడ్జెట్ సమర్పించారు. సోమవారం నగరసభ సభాంగణంలో జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర, నగరసభ పాలనాధికారి డాక్టర్ రవీంద్ర అధ్యక్షతన రూ.2.09 కోట్ల మిగులుతో బడ్జెట్ సమర్పించారు. రూ.217 కోట్ల ఆదాయం కాగా రూ.2.09 కోట్ల మిగులు సాధ్యమని నగరసభ కౌన్సిల్‌కు వివరించారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల వేళ మాత్రమే రాజకీయాలు ఉండాలని, ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో రాజకీయాలు ఉండరాదన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు చొరవ చూపాలన్నారు. ఇంటింటికీ యూజీడీ వ్యవస్థ కల్పించేలా ప్రభుత్వానికి విన్నవించడంతో రూ.30కోట్ల గ్రాంటు విడుదల చేసిందని, పట్టణంలో సుమారు 107 బోరుబావులు ఉన్నాయన్నారు. కాగా రూ.4.56 కోట్లతో అంబేడ్కర్ భవనాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. జిల్లా అధికారి రవీంద్ర మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే ప్రైవేట్ బోర్లనుంచి నీరు సమకూర్చాలని ఇందుకు 15 రోజులకోసారి బిల్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే స్వచ్ఛతకోసం పౌరకార్మికులకు ప్రజలు సహకారం అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బీఎన్ స్వామి, నగరసభ కమిషనర్ మంజునాథ్, నగరసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ సమావేశంలో ఉన్నతాధికారులు

ఘనంగా నవగ్రహ దేవాలయ వార్షికోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న పురసభ సభ్యుడు తదితరులు

విజయపుర, మార్చి 12: దేవాలయాన్ని నిత్యం సందర్శించి భగవంతుడిని భక్తితో ప్రార్థించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పురసభ సభ్యుడు ఎం సతీశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. మంగళవారం పట్టణంలోని నగర్త యువజన సంఘం ఆధ్వర్యంలో నవగ్ర దేవాలయ 14వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. భగవంతుడిపై నమ్మకంతో ముందుకు సాగడం ద్వారా జీవితంలోని సమస్యలను ఎదుర్కొనేందుకు మార్గం వీలవుతుందన్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో నగర్త మహంతి మఠం కార్యదర్శి విశ్వనాథ్, మాజీ డైరెక్టర్ రుద్రమూర్తి, మురళి, సురేశ్, యువజన సంఘం అధ్యక్షుడు ఏ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులకు శ్రీకారం

శ్రీనివాసపుర, మార్చి 12: తాలూకాలోని సుగటూరు హోబళిలోని తొట్టి, నాగనాళ గ్రామాలలో కేంద్రప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకం కింద రూ.2.28 కోట్లతో ఇంటింటికీ కొలాయి నీరు అందించే పనులకు ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి చేశారు. సుగటూరు హోబళి తొట్టి గ్రామంలో గంగమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం జలజీవన్ మిషన్ పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే అంగన్‌వాడీ కేంద్రం పనులు చేపడతామన్నారు. ఇదే సందర్భంగా గ్రామం మధ్యలో రూ.5లక్షలతో చేపట్టే రంగమందిరం పనులకు భూమిపూజ చేశారు. గ్రామపంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ యువకుల కోసం క్రీడాసామగ్రి కిట్‌లను త్వరలోనే ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు నంజుండప్ప, తొట్టి పాల ఉత్పత్తిదారు సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మునిశామి, నారాయణస్వామి, తమ్మేగౌడ, వెంకటరెడ్డి, కేశప్ప, శ్రీనివాసరెడ్డి, ముని వెంకటరవణప్ప తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం



మొక్కలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ పదాధికారులు

బాగేపల్లి, మార్చి 12: తాలూకాలో పచ్చదనం పెంచేదిశగా కర్ణాటక రత్న పునీత్‌రాజ్ కుమార్ జ్ఞాపకార్థం చేతన్‌నాయుడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిర ఆవరణలో 50మందికి శ్రీగంధం మొక్కలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సంస్థాపకుడు బీఆర్ నరసింహనాయుడు, భార్య సుజాత మంగళవారం మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. నరసింహనాయుడు మాట్లాడుతూ సమాజానికి తమవంతు ఉడతాసేవగా మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రవాసిమందిరం నుంచి నేషనల్ కళాశాల ప్రాంతం వరకు డివైడర్‌పై పూలమొక్కలు నాటామని అవి ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో 10వేల మొక్కలు పంపిణీ చేసే ఆలోచన ఉందన్నారు. కార్యక్రమంలో చిక్కబళ్లాపుర ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి యోజనా అధికారి ప్రశాంత్, పిజి గిరీశ్, పద్మావతి, సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ : గారపాటి

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని ప్రముఖ సమాజ సేవకుడు శ్రీరామనగరకు చెందిన స్వామి వివేకానంద సేవా సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ పేర్కొన్నారు. కురుగోడులోని వాల్మీకి సముదాయ భవన్‌లో జరిగిన ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బెంగళూరుకు చెందిన సప్తగిరి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటైన ఈ శిబిరంలో కేన్సర్, నరాల సంబంధమైన రుగ్మతలు, హృద్రోగ సమస్యలు, నేత్ర సమస్యలకు సంబంధించి ఉచిత వైద్యపరీక్షలను నిర్వహించారు. ఇదే వేదికపై డా.గారపాటి రామకృష్ణ, దుర్గారాణిల 40వ వివాహ వార్షికోత్సవం కూడా ఏర్పాటైంది. సమాజసేవలో ఖ్యాతి గడించిన దంపతులను ఘనంగా సన్మానించారు. కాగా ఆరోగ్య శిబిరంలో కురుగోడు చుట్టు పక్కల ప్రాంతాల నుండి వందలాది మంది ప్రజలు హాజరయ్యారు.



సన్మానం అందుకున్న ప్రముఖులు

శక్తి పథకానికి విశేష ఆదరణ

» మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఉచిత రవాణా పథకం శక్తికి భారీగా ప్రజాదరణ లభిస్తోందని రవాణా శాఖా మంత్రి ఆర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. నగరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఈ పథకానికి తొలి ఏడాది రూ.2,800 కోట్లు ఖర్చయిందని ప్రస్తుత ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.5,100 కోట్లు కేటాయించిందన్నారు. మొత్తం నాలుగు రవాణా కార్పొరేషన్లలోనూ ఈ ఉచిత ప్రయాణ పథకం అమల్లో ఉందని గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత ఏడాది ప్రయాణీకుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. ఈ పథకానికి గ్రాంటును మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు విజ్ఞప్తిచేశానన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, నూతన బస్టాండ్ల నిర్మాణం వంటి వాటికి ఈ గ్రాంట్ల అవసరం ఉందన్నారు. కాగా శక్తి పథకం విజయాలపై ప్రత్యేక డాక్యుమెంటరీని కూడా నిర్మించే ఆలోచన ఉందని లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఇది కూడా ఒక ప్రముఖ అంశంగా చేర్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

కేపీఎస్సీ సభ్యుడిగా రామకృష్ణ ప్రసాద్



రామకృష్ణప్రసాద్

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమీషన్(కేపీఎస్సీ) సభ్యునిగా కేఎస్ఆర్పీ డిఐజి ఎంవీ రామకృష్ణ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేపీఎస్సీలో అధికారుల కోటాలో ఖాళీగా ఉన్న ఈ పదవిలో రామకృష్ణప్రసాద్ నియామకం జరిగింది. కోలారు జిల్లా బంగారుపేట తాలుకా మాగొందికి చెందిన రామకృష్ణప్రసాద్ సమర్థుడైన పోలీస్ అధికారిగా పేరొందారు. అత్యుత్తమ సాధనకు గాను 2004లో ముఖ్యమంత్రి బంగారుపతకం అందుకున్నారు. తెలుగు భాషను కూడా ఆయన చాలా అనర్గళంగా మాట్లాడతారు.

15 నుంచి నగరంలో అవేక్ ఆధ్వర్యంలో స్వావలంబన మేళా

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక వాణిజ్య పరిశ్రమలశాఖ, భారతీయ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (సిడ్బి), రాష్ట్ర మహిళా పారిశ్రామిక వేత్తల సంస్థ (అవేక్)ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15నుంచి మూడు రోజులపాటు స్వావలంబన మేళా జరగనుంది. ఈమేరకు అవేక్ అధ్యక్షురాలు ఎస్ఆర్ ఆశా, గౌరవ కార్యదర్శి డీ జగదీశ్వరి నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చిత్రకళా పరిషత్‌లో ఈనెల 15నుంచి 17వరకు జరిగే ఈ ప్రదర్శనలో మహిళా స్వసహాయ గ్రూపులు తయారుచేసిన రకరకాల వస్తువులు, పదార్థాలను ఈ మేళాలో విక్రయించబోతున్నట్టు తెలిపారు. 1983లో ప్రారంభమైన సంస్థ ఇంతవరకు 2లక్షలమందికిపైగా మహిళల ఆర్థిక స్వావలంబనకు బలమైన పునాదులు వేసిందని ప్రకటనలో పేర్కొన్నారు. మేళాలో రాష్ట్రం నలుమూలలనుంచి మహిళా పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంఘాలు పాలుపంచుకోబోతున్నాయన్నారు. ప్రదర్శనను స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ ప్రారంభించనుండగా సిడ్బి సీఎండీ ఎస్ రామన్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు.

బైలాంజనేయస్వామికి విశేష పూజలు



ఆంజనేయస్వామికి విశేష అలంకరణ

శిడ్లఘట్ట, మార్చి 12: తాలూకాలోని అప్పిగౌడనహళ్ళిగేట్ సమీపాన గల బైలాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. రామభజనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ సన్నిధి ప్రాంతాన్ని తొలుత స్వచ్ఛపరిచి, అభిషేకం, తమలపాకులతో అలంకరణ, తులసి, పుష్పాలంకరణ అనంతరం నైవేద్యం సమర్పించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నసంతర్పణ కూడా నిర్వహించారు.

కాశీ విశ్వేశ్వర ఆలయంలో వేడుకలు



పల్లకిలో స్వామివారి ఊరేగింపు

చేళూరు, మార్చి 12: తాలూకా కేంద్రమైన చేళూరులోని ప్రసన్న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నాలుగు రోజులపాటు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రతిరోజూ విశేషపూజలు, అలంకరణలు సాగాయి. సోమవారం రాత్రి పూలపల్లకీ, కరగ మహోత్సవం స్వామివారి ఊరేగింపు పురవీధులలో సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీంతో శివరాత్రి తిరునాళ్ల సందడి ముగిసింది. ఆలయ ధర్మకర్త మండలి నిర్వాహకులు ఉత్సవాలను విజయవంతంగా పర్యవేక్షించారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారి దారుణహత్య

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు దారుణంగా హత్యకు గురయ్యాడు. హత్యచేసిన దుండగులు ఆయన శవాన్ని కారులో పడేసి పారిపోయారు. బళ్ళారి రోడ్డులోని బాగలూరు క్రాస్ వద్ద కారులో హత్యకు గురైన పారిశ్రామికవేత్త మృతదేహం కనిపించడంతో కలకలం చెలరేగింది. తక్షణం యలహంక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన జరపగా హత్యకు గురైన వ్యక్తిని కృష్ణాయాదవ్‌గా గుర్తించారు. ఏదో పనినిమిత్తం బయటకు వెళ్లిన ఆయన సోమవారం రాత్రి నుంచి కనిపించడం లేదని, మంగళవారం ఉదయం బాగలూరు క్రాస్ రోడ్డుపక్కన ఆగిన నీలిరంగు కారులో ఇతడి మృతదేహాన్ని గుర్తించారు. కోగిలు ప్రాంతం వెంకటాల వద్ద ఇతడికి రియల్‌ఎస్టేట్ కార్యాలయం ఉన్నట్టు తెలుస్తోంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. వ్యాపార లావాదేవీలే ఈ హత్యకు కారణమై ఉండవచ్చునన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చుట్టుపక్కల సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కృష్ణాయాదవ్ హత్యతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

తేరుకు నిప్పు.. ఉత్తరప్రదేశ్ వాసి అరెస్టు



నిందితుడు

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా గుబ్బి తాలూకా ని ట్టూరు హోబళి పుర గ్రామానికి చెందిన కల్లేశ్వరస్వామి రథానికి నిప్పు పెట్టిన ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. దేవదాయ పరిధికి చెందిన కల్లేశ్వరస్వామి ఆలయ రథానికి సోమవారం మధ్యాహ్నం ఒక వ్యక్తి నిప్పు పెట్టాడు. దీంతో రథం పూర్తిగా కాలిపోయింది. ఘటనకు కారకుడైన వ్యక్తిని స్థానికులు గుర్తించి పట్టుకున్నారు. స్థానిక రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ ఫిర్యాదు మేరకు గుబ్బి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడు ఉదారి (35)ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఇతను ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘోరక్‌పుర ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఘటనలో సుమారు 20లక్షల మేరకు నష్టం వాటిల్లినట్టు అంచనా. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు చేపట్టనున్నట్టు జిల్లా ఎస్పీ ప్రకటించారు.

న్యాయం దక్కలేదని యువతి ఆత్మహత్య

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించిన వ్యక్తి వేలంటైన్స్ డే రోజున అత్యాచారానికి పాల్పడగా న్యాయం దక్కలేదని మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మైసూరు జిల్లా హుణసూరు తాలూకా శ్యానభోగనహళ్ళిలో ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువతి(19) అదే గ్రామానికి చెందిన వేణుగోపాల్ (35), ఇతడికి సహకరించిన మహేశ్‌పై బిళికెరె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఫిబ్రవరి 14న యువతిని అదే గ్రామానికి చెందిన వేణుగోపాల్ తన బొలెరో వాహనంలో పిలుచుకెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి కేరళకు తీసుకెళ్లాడు. అత్యాచారానికి పాల్పడిన అనంతరం మైసూరుకు వాపసు వచ్చాక వెయ్యి రూపాయలు ఇచ్చి ఇంటికి వెళ్లాలని సూచించాడు. ఘటనపై బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలుస్తోంది. అయితే విషయం కాస్త ఎస్పీ దృష్టికి వెళ్లడంతో ఫిబ్రవరి 21న బిళికెరె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇలా ఉండగా సదరు యువతికి వేరొక యువకుడితో వివాహం నిశ్చయమైంది. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా న్యాయం దక్కలేదనే బాధతో యువతి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది.